నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, సోమవారం 21 ఏప్రిల్ 2025 | KAMAREDDY

రైతుభరోసా పరిస్థితి ఇదీ..

రైతు భరోసాపై మంత్రులు, ఎమ్మెల్యేలు పూటకోసారి మాట మారుస్తూ రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో రైతు భరోసా పంపిణీ షురూ అయినప్పటికీ ఇప్పటి వర కూ పూర్తి స్థాయిలో అమలు కాలేదు. దీంతో రేవంత్ సర్కారుపై రైతన్నలంతా దుమ్మెత్తి పోస్తున్నారు. రూ. ఆరువేల పెట్టుబడి సాయాన్ని కూడా సరైన రీతిలో అందివ్వకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

IIT JEE MAINS ఫలితాల్లో కాకతీయ విద్యార్థుల ప్రభంజనం !

2025 JEE MAINS ఆర్.మేఘన 824 All India Rank యం.సంకీర్త్ 1750 All India Rank లను అభినందిస్తున్న Kakatiya IIT/NEET Academy డైరెక్టర్ సి.హెచ్.రామోజీ రావు IITIAN.

తేది: 19.04.2025 విడుదలైన JEE MAINS-2025 ఫలితాలలో మన నిజామాబాద్ జిల్లా కాకతీయ కళాశాలలో ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం చదువుతూ ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే డైరెక్టుగా IIT-JEE MAINS పరీక్షల్లో జాతీయ స్థాయి ర్యాంకు పొందిన ఆర్.మేఘన 824, ఎం.సంకీర్త్ 1750, భానుప్రతాప్ 3820, బి. ప్రవీణ్ 7456 ర్యాంకులతో నిజామాబాద్ కాకతీయ ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రభంజనం. JEE MAINS-2025 ఫలితాల్లో ప్రతి విద్యార్థి ఇంటర్‌తో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటి/మెడికల్ లలో రాణించడమే కాకతీయ లక్ష్యం. అందుకు అనుగుణంగా 2024-25 మా అకాడెమిక్ ప్రోగ్రాం మన విద్యార్థులు ఇంటర్‌తో పాటు పోటీ ప్రవేశ పరీక్షలైన జాతీయ స్థాయి ఐఐటి/మెడికల్ లలో పక్కగా రాణించేటట్లు రూపొందించడమైనది.

R.MEGHANA ALL INDIA RANK 824

నేను అనగా ఆర్.మేఘన ఎం.పి.సి. విభాగంలో కాకతీయ ఐఐటి/నీట్ అకాడమీ లో చదువుతున్నాను. నేడు వెలువడినటువంటి జెఈఈ మెయిన్స్‌లో ఫలితాలలో నాకు ఆల్ ఇండియా ర్యాంకు 824 సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను నా స్కూలింగ్ 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు కాకతీయ ఓలంపియాడ్ స్కూల్‌లో చదవడం వల్లనే నా ఈ ర్యాంకు సాధించానని గర్వంగా చెప్పగలను. KOS లో ఉదయం క్లాసెస్ రెగ్యూలర్ సిలబస్ పై టీచర్లతో శిక్షణ, ప్రతిరోజు మధ్యాహ్నం ప్రతి సబ్జెక్ట్ పై ఇంటర్ ఎంసెట్ స్థాయి లెక్చరర్లతో ఐఐటి/ మెడికల్ ఫౌండేషన్ శిక్షణను ఇచ్చేవారు. ఇలా స్కూల్ స్థాయిలో ప్రత్యేకమైన శిక్షణకు మూలకారణం మా KOS డైరెక్టర్ సి.హెచ్. తేజస్విని, ఎం.టెక్. (పి.హెచ్.డి)

వీరు వేరే బ్రాంచి, వేరే జిల్లా, వేరే రాష్ట్రంలో చదివిన విద్యార్థులు కారు, ఈ విద్యార్థులు లాంగ్‌టైం కోచింగ్ తీసుకున్నవారు కారు. ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే వచ్చిన ర్యాంక్స్ అని గమనించగలరు. తేది: 19-04-2025న IIT-JEE MAINS-2025 ఫలితాలలో కాకతీయ విద్యార్థులు 99.48, 97.18, 95.35, 95.03, 93.68, 93.65, 91.95, 91.08, 90.15 ఇలా 90% tile పైన 09 మంది విద్యార్థులు ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలో జాతీయ స్థాయిలో ఆల్ ఇండియా ర్యాంకులను సాధించారని డైరెక్టర్ సి.హెచ్.రామోజీరావు (IITIAN) తెలిపారు.

రుణమాఫీ కాకున్నా.. రైతు భరోసా రాకున్నా..

రైతు మహోత్సవం?



రుణమాఫీ అంతంత మాత్రంగానే..

- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతాంగం
- ఏడాదిన్నరగా రుణమాఫీ కోసం ఎదురుచూపు
- యాసంగి పంట చేతికొచ్చినా.. పత్తాలేని పెట్టుబడి సాయం
- నేడు నిజామాబాద్ నగరానికి మంత్రులు జూపల్లి, ఉత్తమ్, తుమ్మల
- హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తున్న ఉమ్మడి జిల్లా రైతులు

నిజామాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ పాలనలో రైతులకు దిక్కూ మొక్కూ లేకుండా పోతున్నది. ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో రైతన్నలంతా ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుభరోసా పేరిట ఎకరాకు రూ.15వేల చొప్పున రెండు పంటలకు పెట్టుబడి సాయం అందిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. తొలి రెండు సీజన్లలో పెట్టుబడి సాయం మాటెత్తలేదు. ఈ యాసంగి సీజన్‌లో రైతుభరోసా పథకం కింద రూ.12వేలు ఎకరానికి ఇస్తామన్నారు. నిజామాబాద్ జిల్లాలో యాసంగిలో వరి సాగుచేసిన రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారు. అయినా రైతుభరోసాకు అతీగతీ లేదు. మరోవైపు రుణమాఫీ పేరిట గతేడాది పండ్రాగస్టు రోజున ప్రక్రియను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సగాని కన్నా ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. దీంతో వారంతా చెప్పులు అరిగేలా వ్యవసాయాధికారులు, బ్యాంకర్ల చుట్టూ తిరుగుతూ విసుగు చెందుతున్నారు. రైతు మహోత్సవం పేరిట నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్ల ప్రదర్శనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రైతులకు మేలు చేకూర్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటున్నది. సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు వస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి రాక నేపథ్యంలో రైతు భరోసా, రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని ఉమ్మడి జిల్లా రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో ఇప్పటి వరకు నాలుగు విడుతల్లో రుణమాఫీ జాబితాలు విడుదలయ్యాయి. అయినప్పటికీ లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో బాధితులు రుణాల రద్దు కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఐదో విడుత ఏదంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. లక్షలాది మందికి రుణమాఫీ ఇంకా వర్తించకపోవడంతో వారంతా ప్రభుత్వంపై మండిపడుతున్నారు. హామీలు ఇచ్చి, ఇప్పుడు అమలు చేయకపోవడం రైతు మహోత్సవం అవుతుందా? అని ప్రశ్నిస్తున్నారు.

నిజమైన రైతు మహోత్సవం కావాలంటే?

రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవం పేరిట 136 స్టాళ్లను జీజీ కాలేజీలో ఏర్పాటు చేస్తున్నది. ఇందులో రైతులు పండించిన పంట ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, ఉద్యాన వన, పశు సంవర్ధక, మత్స్య శాఖ, అనుబంధ రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు, అధికారులు హాజరు కానున్నారు. నూతన వ్యవసాయ పద్ధతులపై వర్క్ షాపు నిర్వహించబోతున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం రైతుకు ఆదరణ కరువైంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రంచనుగా పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు కాలం ముగిసినప్పటికీ పత్తా లేకుండా పోయింది. రుణమాఫీ రూ.2లక్షల్లోపు రద్దు చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పాలకులు వాటి గురించే మాట్లాడడం లేదు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి ఉంటే రైతులకు మహోత్సవం వర్ధిల్లేదని సర్వత్రా చర్చ నడుస్తోంది. స్టాళ్లను ఏర్పాటుచేసి సాంకేతికత, సాగు పద్ధతలపై వర్క్‌షాపులు నిర్వహించడం వల్ల రైతులకు కాసింత మేలు చేకూర్చే అవకాశం ఉన్నప్పటికీ పెట్టుబడి సాయం వంటి ఆర్థిక భరోసాను కాంగ్రెస్ సర్కారు అసంపూర్ణంగా అమలు చేయడంతో రైతుల ముఖాల్లో ఆనందం లేకుండా పోతోందనేది సర్వత్రా అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. ఎకరాకు రూ.15వేలు చొప్పున ఏటా రైతు భరోసా ఇస్తామంటూ చెప్పినట్లే అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేస్తేనే మహోత్సవం చేసినట్లు అవుతుందని రైతులు భావిస్తున్నారు. కేసీఆర్ పాలనలోనే రైతులకు నిజమైన రైతు మహోత్సవం కనిపించిందని వారంతా చెబుతున్నారు.

రాజకీయ కక్షతోనే వేధింపులు

- సుదర్శన్‌రెడ్డి దొంగ కేసులు బనాయించారు.. ఆయనకు బరాబర్ అకౌంట్స్ సెటిల్ చేస్తాం
- ఇకపై బోధన్‌లోనే ఉంటా..
- బీఆర్ఎస్ కార్యకర్తలు కేసులకు భయపడరు..
- సన్నాహక సమావేశంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్

బోధన్, ఏప్రిల్ 20: ' బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నాపై రాజకీయ కక్షతో నా కుమారుడిని, నా కుటుంబాన్ని మానసిక వేదనకు గురిచేశాడు. చదువుకుంటున్న కుమారుడి భవిష్యత్తును నాశనం చేయడానికి ప్రయత్నించాడు..' అని బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్.. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.. బోధన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డిది దిగుజారుడు రాజకీయమని, తన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా హైదరాబాద్‌లోని తన ఇంటికి మూడేసి వందల మంది పోలీసులను పంపించారన్నారు. తనపై తప్పుడు కేసులు బనాయించారని, వాటిలో నిజం లేదన్నారు. ప్రజలకు తాను పదేళ్లపాటు చేసిన సేవలకు శిక్షను అనుభవించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల తన తల్లి మరణించినప్పటికీ.. ఆయన తనను పరామర్శించడానికి సుదర్శన్‌రెడ్డి రాలేదన్నారు. అదే సుదర్శన్‌రెడ్డి తల్లి దండ్రులు మరణించినప్పుడు తాను స్వయంగా వెళ్లి పరామర్శించడమే కాకుండా జిల్లాలోని అప్పటి ఎమ్మెల్యేలను తీసుకెళ్లానని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలను సుదర్శన్‌రెడ్డి ఇబ్బంది పెడుతున్నాడని, వీటిని మానుకుంటే మంచిదని, లేనిపక్షంలో అతడికి అకౌంట్స్ సెటిల్ చేయకతప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ సైనికులు కేసులకు భయపడరని, తెలంగాణ ఉద్యమం నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దని, ఈ విషయం కాంగ్రెస్ ప్రభుత్వం గమనించాలని అన్నారు.

కొంతకాలంగా తాను అనారోగ్యంతో దుబాయ్‌లో ఉన్నానని, ఇక్కడ కాంగ్రెస్ వాళ్లు తనపై దుష్ప్రచారం చేశారని షకీల్ విమర్శించారు. ఇకపై తాను బోధన్‌లో ఉంటానని, ప్రజల పక్షాన పోరాడుతానని, బీఆర్ఎస్ కార్యకర్తలు ఇక భయపడేదే లేదని ఆయన స్పష్టంచేశారు. తన పదేండ్ల ఎమ్మెల్యే పదవీ కాలంలో బోధన్ నియోజకవర్గం ఎంతో సస్యశ్యామలంగా ఉండేదని, సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వడం ఒక బోగస్‌లా మారిందని, నిజాంసాగర్ కాల్వల్లో నీళ్లు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయి మళ్లీ కేసీఆర్ కావాలంటున్నారని చెప్పారు. సుదర్శన్‌రెడ్డి గతంలో ఇరిగేషన్ మంత్రిగా ఉండి నియోజకవర్గానికి కనీసం ఒక చెక్‌డ్యామ్ కూడా తీసుకురాలేక పోయారని ఆక్షేపించారు.

తాను ఇక్కడ లేని సమయంలో తనపై కొన్ని పత్రికలు, కొన్ని చిన్న చిన్న ఛానళ్లు తప్పుడు వార్తలు రాశాయని, నిరాధారంగా ఒకసారి రూ.2000 కోట్లు ఫ్రాడ్ చేశానని చెబుతూ ఇప్పటికీ రూ.7 కోట్లకు దిగివచ్చాయని, ఇప్పుడు అది ఫైన్ మాత్రమే అని చెబుతున్నాయని షకీల్ అన్నారు. తోచినట్లుగా తప్పుడు వార్తలు రాయడం ఏమిటని ప్రశ్నించారు.

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి..

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని షకీల్ కోరారు. సభకు ప్రజలను పెద్ద సంఖ్యలో తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు గాండ్ల రవీందర్ యాదవ్ అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు నర్సింగ్‌రావు, భూమ్‌రెడ్డి, డి.శ్రీరామ్, గోగినేని నర్సయ్య, సంజీవ్‌కుమార్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, నియోజకవర్గం నాయకులు తెలంగాణ శంకర్, కాశం సాయిలు, వాసే, భవానీపేట్ శ్రీనివాస్, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ విప్ గంప గోవర్ధన్

- రాష్ట్రంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్

మాచారెడ్డి, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని ప్రభుత్వ మాజీ విప్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గజ్యానాయక్‌తండా ఎక్స్ రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి మాచారెడ్డి మండల ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి మూడు వేల మంది కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇందు కోసం తగిన వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్.. జీవితంలో మళ్లీ అధికారంలోకి రాదన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో కార్మికులు మే 6న సమ్మె చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో సంతోషంగా ఉన్న రైతులు.. కాంగ్రెస్ హయాంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

సిల్వర్ జూబ్లీ ముగిసిన అనంతరం కేసీఆర్‌తో సమావేశం

బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముగిసిన అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు గంప గోవర్ధన్ తెలిపారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌తో కలిసి సహపంక్తి భోజనం ఉంటుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారని తెలిపారు. పార్టీ అధికారం కోల్పోవడంతో పలువురు అన్ని పదవులు అనుభవించి, బీఆర్ఎస్‌ను వీడిపోయారని, వారిని ఎట్టి పరిస్థితుల్లో తిరిగి పార్టీలోకి తీసుకోబోమని స్పష్టంచేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం, మాజీ జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, నాయకులు హంజీనాయక్, బూస శ్రీను, తోకల కిషన్, గైని శ్రీనివాస్‌గౌడ్, లస్కర్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, కూచని శేఖర్, పైడాకుల రాములు, చల్లా కృష్ణారెడ్డి, భూక్యా భాస్కర్, సలేంద్రి శ్రీశైలం, దువ్వాక లక్ష్మీనర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కారుపై ప్రజా వ్యతిరేకత

- 500మంది రైతులను బలిగొన్న ప్రభుత్వం
- ఉపాధి లేక పేద ప్రజల జీవనం చిన్నాభిన్నం
- నిలదీస్తే తిట్టడాలు, కొట్టడాలు, కేసులు పెట్టడాలు
- త్వరలోనే రేవంత్ దుష్టపాలనకు చరమగీతం
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 20: కాంగ్రెస్ సర్కారుపై ప్రజా వ్యతిరేకత పెల్లుబిక్కుతున్నదని, త్వరలోనే రేవంత్ పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అవకాశవాద, అవినీతి, దగాకోరు పాలన ఫలితంగా రాష్ట్రంలో మరణమృదంగం మార్మోగుతున్నదని తెలిపారు. కాంగ్రెస్ పాలనపై ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేవంత్ అమసర్థ పాలనతో ఇప్పటికే 500మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధి లేక పేద ప్రజల జీవనం చిన్నాభిన్నమైందని పేర్కొన్నారు. పాలనపై విసిగి వేసారిన ప్రజలు.. ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలపై తిరుగుబాటు చేస్తున్నారని తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను పాతిపెట్టిన రేవంత్ సర్కారు.. రైతుబంధును అమలు చేయకపోవడంతోపాటు తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరాన్ని వినియోగించుకోకపోవడంతో పంటలు ఎండబెట్టిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో వ్యవసాయం కుప్పకూలి రైతన్నకు మానని గాయమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ భూదాహానికి మూగజీవులు సైతం బలవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సర్కారు మోసాలను నిలదీస్తున్న ప్రజలపై కాంగ్రెస్ పోట్టేళ్లు దాడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల భీమ్‌గల్ వచ్చిన మంత్రి జూపల్లి కృష్ణారావును కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఏమైందని అడిగిన వారిపై దాడి చేయడం కాంగ్రెస్ రౌడీయిజానికి నిదర్శనమని మండిపడ్డారు. నిలదీస్తే కేసులు, నిరసన వ్యక్తంచేస్తే అరెస్టులు, ప్రశ్నిస్తే జైళ్లు, బీఆర్ఎస్ జెండా పట్టినా, ప్లెక్సీ కట్టినా జైళ్లపాలు చేయడం పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధర్నా చేసినా, ఇంట్లోనే ఉన్నా నిర్బంధాలు అమలు చేయడం రేవంత్ ప్రభుత్వంలో నిత్యకృత్యమయాయని నిప్పులు చెరిగారు. ప్రభుత్వం బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులను ఉసిగొల్పుతున్నదని తెలిపారు. ఒక్కో రంగాన్ని టార్గెట్ చేసి కక్షగట్టి అందులోని ప్రముఖుల మీద కేసు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. చివరకు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసినా కేసుపెడుతున్నారని, అప్రకటిత ఎమర్జెన్సీ పడగనీడలో రాష్ట్రం బిక్కుబిక్కుమంటున్నదని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం అంటే హింసా, విధ్వంసమేనా ? అని ఆయన ప్రశ్నించారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి.. ఎన్నికల హామీలన్నీ గల్లంతు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారుకు పోయే కాలం దాపురించిందని, రేవంత్‌రెడ్డి సాగిస్తున్న దుష్ట పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజు ఎంతో దూరంలో లేదని జీవన్‌రెడ్డి హెచ్చరించారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఖలీల్‌వాడి (మోపాల్), ఏప్రిల్ 20: నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని చిన్నాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. టీఎస్ ఆర్టీసీ మాజీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో, బాజిరెడ్డి జగన్ నేతృత్వంలో వారు గులాబీ కండువా కప్పుకున్నారు. బీజేపీ చిన్నాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు సిద్ధార్థరెడ్డి, చిన్నాపూర్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు రూప్‌సింగ్ వారి అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌కు ఉన్న ఆదరణ చూసి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు



ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు దఫేదార్ శోభ –రాజు కూతురు కీర్తన వివాహం రిత్విక్‌తో ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ మాజీ విప్ గంపగోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్ షిండే, జాజాల సురేందర్, బీఆర్ఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, మాజీ ఎంపీ బీబీపాటిల్, నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

–కామారెడ్డి, ఏప్రిల్ 20